

# అది వ్యాపారం-ఇది సంసారం

—డి. జయలక్ష్మి

**అడపా** దడపా జకరయ్య ఇంటికి బంధువులూ, స్నేహితులూ వస్తుంటారు. మేరీ అనే మేకపిల్ల జకరయ్య దంపతుల చేతులతోనే మేత తినడం, వాళ్ళ పక్కమీదనే పడుకోవడం చూసి వాళ్ళంతా విస్తుపోయేవారు.

వాళ్ళ మాటకేం? పేరు మోసిన పెద్ద వర్తకులూ, కంట్రాక్టర్లూ తరుచు వాళ్ళింటికి రావడం కద్దు. వచ్చి విడ్డూరంగా అనేవారు—

“జకరయ్యగారూ! మిమ్మల్ని అర్థం చేసుకోలేకుండా ఉన్నామండి! ఎన్నేళ్ళుగా మీరీ వ్యాపారం సాగిస్తున్నారో, మీ హయాంలో ఎన్ని లక్షల మేకలు ఇప్పటికి బలి అయిపోయినయో మాకు తెలుసుకదా? ఈ ఒక్క మేకపిల్లను మీరింత మక్కువగా, ప్రాణ సమానంగా పెంచుతున్నారంటే మా కాశ్చర్యంగానే ఉన్నదండీ” అని.

వారికి ఒకటే సమాధానం చెప్పేవాడు జకరయ్య—“అది వ్యాపారం, ఇది సంసారం” అంటూ.

సూక్ష్మమైన ఈ సమాధానంతో వారు తృప్తి పడినట్టు లేదు. ఒక పర్యాయం విడవకుండా ఇంకా ఏదో వినదలిచినట్టుగా అతనివంకే చూస్తూ కూర్చున్నారు. ఇది గ్రహించిన జకరయ్య ఇలా చెప్పసాగాడు:

“మా పూరి పొలిమేరను దిక్కూ మొక్కూ లేక, దినం గడవక, చిన్న పూరి పాకలో మహంకాళి అనే ముసలిది రోజులు వెళ్ళబుచ్చుతూ ఉంది.

“ఒకనాడు చక్కటి తెల్లని మేకపిల్ల దారితప్పి బెదురుతూ వచ్చి, ఆ పాకలో దూరింది. దాని జాలి చూపులకు ముసలిదాని మనస్సు కరిగిపోయి, దానిని ఆ పూటనే కట్టేసి, నాటినుంచి దాన్ని కన్నబిడ్డలాగా చూసుకుంటూ ఉంది.

“అవ్వ దూరపుబంధువు ఒకాయన పొరుగూరినించి ఏదో పనిమీద వచ్చి ముసలి దాని పాకలో మకాం చేశాడు. అతడు ఉన్న ఆరు నెలలూ అవ్వకు తిండీ, బట్టా లోటు లేకుండా గడిచిపోయింది. వచ్చిన పని పూర్తి కాగానే పట్నం పోతూ చేతిలో కొంత డబ్బు పెట్టి ఊరికి వెళ్ళిపోయాడు.

“ఆ డబ్బుతో అవ్వ పనికి పోయిన పాక తిరిగేయించుకుని, ఉపాధి కోసం వీధి అరుగుమీద చిన్న ఫలహారాల కొట్టు పెట్టుకుంది. ఇదంతా మేకపిల్ల వచ్చిన వేళా విశేషమేనని నమ్మి, దాన్ని మరింత ముద్దు చేసి, పెంచుతూ వచ్చింది.

“కొన్నాళ్ళకు తెల్లమేక చూలు కట్టింది. అవ్వ సొంత కూతురికి చేసినట్టే దాని అచ్చటూ ముచ్చటూ తీర్చడమే కాదు, దాన్ని కట్టడమే మానేసి స్వేచ్ఛగా వదిలేసింది. నెలలు నిండిన కొద్దీ మేక ఒళ్ళు పుంజుకుని మిసమిసలాడుతూ ఉంది. ఇప్పుడు దాన్ని చూస్తే అవ్వకు ఎంత ఆనందమో! ‘ఆహా! నాకింక మనమరాలు పుట్టబోతుంది కదా! దానితో ఆడుకోటానికే నాకు పొద్దు చాలదుకాబోలు!’ అనుకుని మురిసి పోయేది. అనుకున్నట్టుగానే మేకకు ఆడపిల్ల పుట్టింది. నిగనిగలాడే నల్ల మేకపిల్ల. అవ్వ సంతోషానికి అంతు లేకుండా పోయింది.

“కొద్ది రోజుల్లో వయసు మళ్ళిన అవ్వకు సుస్తీ చేసింది. దానితో బెంగ పట్టుకుంది. ‘నేను పోతే నా సంతతిని చూసే వాళ్ళెవరు? నా కూనలు రెండూ బతికేదెట్లా?’ అని ఈ వేదనతో చిక్కి శల్యమై మంచం పట్టేసింది. అంత జబ్బులోనూ పిల్లమేక చెంగుచెంగున గెంతుకుంటూ దగ్గరికి వచ్చే సరికల్లా అవ్వకు ప్రాణం లేచి వచ్చేది. ఒక రాత్రి ఏమయిందేమో ఆయుస్సు నిండిన అవ్వ కన్ను మూసింది. చుట్టు పక్కలవాళ్ళు వచ్చి ముసలిదాన్ని పిడికెడు బుగ్గిచేసి మన్ను గడిపారు.

“అనుకున్నట్టుగానే ముసలమ్మ మరణంతో తల్లి మేకా, పిల్ల మేకా దిక్కులేనివయ్యాయి. పాకలో ఇప్పుడు తిండి ఏది? ఎవరు తెచ్చి పెడతారు? అందుచేత తల్లీ, పిల్లా చెరో దిక్కుకూ పోయి, కడుపు కోసం తిరిగి తిరిగి పొద్దు గూకే వేళకు మామూలు జాగా చేరుకుని నిద్దర పోయేవి.

“ఒక రోజున—

“అలవాటుగా మేత కోసమని పోయిన పిల్లమేక దారితప్పి మా ఇంటి పక్కనా పరుగెత్తుకు వచ్చింది. అప్పుడు గుమ్మంలో నిలబడి ఉన్నా. ‘మే మే!’

అని అరుస్తూ ఎంతో చనువుగా ముందరి కాళ్ళు రెండు నా గుండె మీద వేసి నిలబడింది.

''అపకంగా దాన్ని ఎత్తుకుని ముద్దెట్టుకుని లోపలికి తీసుకుపోయి నా భార్యకు చూపించాను. ఆమె ఎంతో ముచ్చటపడి, 'దీన్ని మనం పెంచేసుకుందామండీ!' అంటూ దానికి ఆ క్షణమందే మేరీ అని నామకరణం చేసింది.

''మేరీ మా పక్కనిమాదనే పడుకుంటుంది. మేము పెట్టినప్పుడే మేత తింటుంది. అంతదాకా ముట్టుకోదు. నేను రావడం ఆలస్యమైతే, ఎంత రాత్రి అయినా నేను వచ్చేదాకా మేలుకునే ఉంటుంది.

''ఇలా మేరీ మాకు బిడ్డల్లేని లోటు తీర్చి, మా సంసారాల్లోనూ ఒకటి అయిపోయింది. ముద్దు కొద్దీ మేరీని ఇష్ట రాజ్యంగా తిరిగి ఆడుకోనిస్తాము. మామూలు మనుషులు చేసినట్టు దాన్ని స్వేచ్ఛగా వదిలెయ్యడమే కాని రాటకు కట్టిపెట్టి ఎరగం. స్వేచ్ఛ ఇచ్చాం కదా అని మేరీ హద్దు మీరలేదు. కంచె దాటి అవతలికి పోదు కనక దాన్ని గురించి మాకు నిశ్చింత.

''నన్ను గురించి మీరేమను కుంటున్నారో? నేనూ మనిషినే. నాకూ హృదయ మున్నది. నా భార్యకు నేనంటే ప్రాణం. ఆమెపైన నాకు అమితమైన అనురాగం. దేవుడి దయవల్ల మాకు వలసిన సంపదలన్నీ సమకూరినాయి. ఏ వెలితీ లేదు. ఒకే ఒక్క విషయమై మేమిద్దరం తపించి పోయాం. సంతతి గురించి—ఆ లోటు కాస్తా మా మేరీ వచ్చి తీర్చివేసింది. అందుకనే మేరీపైన మాకంత మక్కువ. అది వ్యాపారం, ఇది సంసారం.''

జకరయ్యది వంశ పారంపర్యంగా వస్తున్న కసాయి వృత్తి. టోకు వ్యాపారం. పేరు మోసిన హోటల్సు ఎన్నింటికో పెద్ద కంట్రాక్టరు అతడు. అతని క్రింద చాలా మంది నౌకర్లు పని చేస్తారు.

కొంతమంది ఊరూరా తిరిగి మేకల్ని, గొర్రెల్ని బేరం చేసి తీసుకువస్తారు. వాటిని విశాలమైన మైదానంలో కట్టేసి సదుపాయంగా ఉంచి మేపుతారు. మామూలు రోజుల్లోనైతే వందల జీవులు సరిపోతాయి. పండగలూ, పబ్బాలూ వస్తే గిరాకీ ఎక్కువ కనక వేల సంఖ్యలో కావలసి వస్తుంది. ఆ సమయాన జకరయ్య కళేలా ఎంతో సందడిగా ఉంటుంది.

వధ్యశాలలో చిన్న చిన్న సిమెంటు దిమ్మెలు వరుసగా ఏర్పాటయి ఉంటాయి. ఏరోజు కారోజు వాటిని పనివాళ్ళు కడిగి శుభ్రం చేస్తారు.

'ఈరోజున ఇన్ని' అని అంచనా కట్టి యజమాని హుకుము ఇస్తే నౌకర్లు ఆ మేకల్ని వరుసపెట్టి సాలలోకి తీసుకు వస్తారు. మరి కొందరు ఒకొక్క దిమ్మెమీద ఒకొక్క మేకనే తల ఆనించి నిలబెట్టుకుంటూ పోతారు. పదును కత్తులతో సిద్ధంగా ఉన్న తలారులు వెనక్కి తిరిగి చూడకుండా ఒక్కొక్క మేకనే తలలు నరుక్కుంటూ పోతారు. ఇదే వాళ్ళ డ్యూటీ.

ఆ వెంటనే మరికొంతమంది వచ్చి నరికేసిన తలలూ, మొండేలూ మరొక చోటికి చేరవేస్తారు. అక్కడ అవయవాలు వేటికవి విడదీస్తారు. టోకు వ్యాపారస్థులకిది ఎంతో సదుపాయం. వాళ్ళనుండి చిల్లర అమ్మకం వాళ్ళు కొనుక్కుపోతూ ఉంటారు.

పండగ దగ్గిరికి వచ్చిందీ అనగానే పనివాళ్ళు వేల సంఖ్యలో మేకల్ని మస్తుగా మేపి మచ్చిక చేశారు. తెల్లవారే సరికి మేకలన్నీ మందగా వచ్చి కంఠం ఎత్తి అరుచుకుంటూ చేరుకున్నాయి. యజమాని హుకుం అయింది. ఇద్దరు నౌకర్లు వాటిని రెండు వరుసలుగా సాలలోపలికి తోలుకు పోయారు. సిమెంటు దిమ్మెల మీద వాటి తలలు వంచారు. తలారులు నరుక్కుంటూ పోతున్నారు.

అంతలో—

''ఆగు, ఆగు'' అంటూ ఇంటి నించి ఉరుకులు పరుగులుగా రొజుకుంటూ రొప్పుకుంటూ జకరయ్య సాలలోకి వచ్చాడు. ఒకొక్క మేకనే చూసుకుంటూ పోతున్నాడు.

గతుక్కుమని ఆగాడు.

ఒక తల వచ్చి అతగాడి కాళ్ళమధ్య పడింది. ఆ కళ్ళతో చూడలేక—''హయ్యో, హయ్యో! మేరీ నా మేరీ!'' అంటూ స్పృహ తప్పి చాపకట్టుగా పడిపోయాడు!

లోగడ జకరయ్య అంటూ ఉండేవాడు—

''అది వ్యాపారం, ఇది సంసారం'' అని. దీని భావం ఇప్పుడిప్పుడే లోకానికి తెలియ వస్తూంది.

★



మూగ ప్రేమ

చిత్రం—ఇ. గోపాలరావు (పొన్నెకల్లు)